క్లుప్తంగా

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మనుబోలు: స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద ఎస్ఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని తహసీల్దార్ లక్ష్మీనారాయణ బుధవారం ప్రారంభించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు ఎస్ఎస్సార్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నారపరెడ్డి కిరణ్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే రాజన్న జలధార పేరుతో తమ ఫౌండేషన్ ద్వారా అక్కంపేట, ముద్దుమూడిలో ఆర్వో ప్లాంట్లను ప్రారంభించి ఉచితంగా తాగునీరు అందిస్తున్నామని వివరించారు. త్వరలో మరో రెండు గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, చిట్టమూరు అజయ్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ముంగర రవీంద్రరెడ్డి, చేరెడ్డి రామిరెడ్డి, సూరపనేని కిషోర్‌నాయుడు, చిట్టమూరు నరసారెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, దువ్వూరు సుధాకర్‌రెడ్డి, కోసూరు కోటేశ్వరగౌడ్, ఆవుల తులసీరాం,, తదితరులు పాల్గొన్నారు.

కనుపర్తితో విడదీయరాని అనుబంధం

- పంచాయతీ అభివృద్ధికి అన్ని విధాలా కృషి
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : కనుపర్తి గ్రామంతో తమ కుటుంబానికి విడదీయరాని అనుబంధం ఉందని, తన తండ్రి కాకాణి రమణారెడ్డి హయాం నుంచి గ్రామం తమ వెంట నడిచిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కనుపర్తి, నరసింహకండ్రిక గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి కాకాణి బుధవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కనుపర్తి మాజీ సర్పంచ్ అట్లా జానకిరామిరెడ్డి, తన తండ్రి కాకాణి రమణారెడ్డి ఒకే రోజు మరణించడం అత్యంత బాధాకరమన్నారు. జానకి లేకుండా తాను కనుపర్తికి వస్తాననుకోలేదని భావోద్వేగానికి గురయ్యారు. జానకి తన తండ్రి అడుగు జాడల్లో నడుస్తూ గ్రామాన్ని అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ఆయన కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికయ్యాడన్నారు. ఇప్పటికే పంచాయతీలో రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తుచేశారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి కనెక్షన్ అందజేశామన్నారు. కనుపర్తి పంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కనుపర్తి, నరసింహకండ్రిక గ్రామాల్లో రూ.1.30 కోట్లతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, రూ.70 లక్షలతో నిర్మించిన డ్రెయిన్లను మంత్రి ప్రారంభించారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పీఆర్ ఏఈలు కసనానాయక్, శివమోహన్, ప్రసాద్, వైఎస్ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ అట్లా వేణుంగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎం బాలకృష్ణారెడ్డి, కాకు శేఖర్, గండవరం సురేంద్రరెడ్డి, అలుపూరు పాపయ్య, నీలం ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదలకూరు : చాటగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని తోడేరు, మరుపూరు ఫీడర్లలో గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పొదలకూరు విద్యుత్ ఏడీఈ బీ సురేంద్రబాబు బుధవారం తెలిపారు. తోడేరు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని,విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

12 నుంచి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

పొదలకూరు : స్థానిక శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహోత్సవాలను ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. 12న అంకురార్పణ,13న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం శేష వాహనోత్సవం, 14న సూర్యప్రభ వాహనోత్సవం, సాయంత్రం హనుమంత సేవ, 15న ఉదయం కల్యాణోత్సవం, గజ వాహనోత్సవం, సాయంత్రం గరుడ వాహనోత్సవం, 16న ఉదయం కల్పవృక్ష వాహనోత్సవం, సాయంత్రం అశ్వవాహనోత్సవం, 17న ఉదయం చక్రతీర్థం, సాయంత్రం పుష్పయాగం, 18న ఉదయం 108 కలశాలతో అభిషేకం నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతిరోజూ అన్న ప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు మనుబోలుకు మంత్రి కాకాణి రాక

మనుబోలు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం మనుబోలుకు రానున్నారు. ఉదయం 10.30 గంటలకు మనుబోలు పరిధిలోని జాతీయ రహదారిని మంత్రి పరిశీలిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

వెంకటాచలం: మండలంలోని నిడిగుంటపాళేనికి చెందిన ఓ యువకుడు అనారోగ్య సమస్యతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. నిడిగుంటపాళేనికి చెందిన పేరం నరసయ్య కుమారుడు బాలయ్య(30) గత కొన్నేళ్లుగా మూర్ఛతో బాధపడుతున్నారు. నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా తన ఆరోగ్య సమస్య నయం కాకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి తన నివాసంలో పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలయ్య బుధవారం ఉదయం మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వెంటాచలం పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

కోవూరు: ప్రకృతి వ్యవసాయంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని డీపీఎం రవిచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని లేగుంటపాడులో ప్రకృతి వ్యవసాయంపై ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌ను బుధవారం తయారు చేశారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రతి మహిళా సంఘం ప్రకృతి వ్యవసాయం చేయని రైతులను గుర్తించి అవగాహన కల్పించాలని సూచించారు. లేగుంటపాడు సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఊరగాయల తయారీపై శిక్షణ



ముత్తుకూరు: ఆదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఊరగాయల తయారీపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోర్టులోని ఫౌండేషన్ కార్యాలయంలో చలివేంద్ర గ్రామానికి చెందిన పది మంది మహిళలకు ఫౌండేషన్ ప్రతినిధి రాజేష్ రంజన్ శిక్షణ ఇచ్చారు. మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. మహిళలు తయారు చేసే పచ్చళ్లు, ఊరగాయాల మార్కెటింగ్‌కు ఫౌండేషన్ సహకరిస్తుందని తెలిపారు. రమేష్‌బాబు, అనూష పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొడవలూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1983 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలను తెలుసుకుని సరదాగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు శైలజ, చెంచురామయ్య, వెంకయ్య, కరీం, పూర్వ విద్యార్థులు ప్రసాద్, జిలానీ, శ్రావణ్, వరప్రసాద్, ప్రేమసాగర్, దేవసేన, ప్రమీల, రాశి పాల్గొన్నారు.

దాడిపై ఫిర్యాదు

కోవూరు: కోవూరుకు చెందిన ఇంతా శ్రీకాంత్‌రెడ్డి కోవూరు ఎస్సీ కాలనీకి చెందిన కాన్షీరామ్‌పై బుధవారం దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. వ్యక్తిగత కక్షతోనే కాన్షిరామ్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు పోలీసులకు బాధితుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారిస్తున్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



ఇందుకూరుపేట : వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కే నాగేంద్రబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంధళ్ల శంకరయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఏమైన సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇందుకూరుపేట కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరి శ్రీనివాసులురెడ్డి, నిడుమునలి పీఏసీఎస్ అధ్యక్షుడు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, డీటీ బషీర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని వినతి



వెంకటాచలం: విక్రమసింహపురి వర్సిటీ పరిధిలో 2015లో డిగ్రీ పూర్తి చేసి సెమిస్టర్ బ్యాక్‌లాగ్స్ కలిగిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు వీఎస్‌యూ రిజిస్ట్రార్ పీ రామచంద్రారెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. 2వ, 4వ, 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలను నాలుగేళ్లుగా నిర్వహించకపోవడంతో విద్యార్థులు విద్యకు దూరమయ్యారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. జాతీయ నూతన విద్యా విధానం అమల్లో భాగంగా ఎక్కడా లేని విధంగా వర్సిటీ ప్రత్యేకంగా వసూలు చేస్తున్న ఇంటర్‌షిప్ ఫీజులను రద్దు చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పంచేటి శ్రీనివాసులు, సాయి, కిషోర్, సత్య వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మహాకుంభాభిషేకానికి పోటెత్తిన భక్తజనం



కుంభాభిషేక మహోత్సవానికి తరలివచ్చిన భక్తులు



సప్తనదుల జల కలశాలను తీసుకెళుతున్న వేదపండితులు



దేవతామూర్తుల విగ్రహాలకు అభిషేకం చేస్తున్న విజయేంద్ర సరస్వతిస్వామి

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో గత నెల 27 నుంచి జరుగుతున్న మహాకుంభాభిషేక వేడుకలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు మహాకుంభాభిషేక ఘట్టాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తజనం పోటెత్తి వచ్చారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతిస్వామి విచ్చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.

వైభవంగా వెండి నంది సేవ

మహాకుంభాభిషేక వేడుక అనంతరం మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి వెండి నంది సేవను వైభవంగా నిర్వహించారు. ఆది దంపతులను విశేషంగా అలంకరించి నంది వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పాలక మండలి సభ్యులు నందకుమార్, రఘురామయ్య, శివకుమార్, పద్మ, విమల, కామేశ్వరి, సుప్రజ, విజయమ్మ, శశిశేఖర్‌శర్మ పాల్గొన్నారు.

రీ సర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

మనుబోలు: మండలంలోని కాగితాలపూరులో రీ సర్వేను బుధవారం చేపట్టారు. సర్వే సిబ్బంది డ్రోన్ సాయంతో రీ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చెముడుగుంట ఏడుకొండలు మాట్లాడుతూ ప్రభుత్వం భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే లక్ష్యంగా రీసర్వే చేపడుతుండడం అభినందనీయమన్నారు. రీసర్వే డీటీ శ్రీకాంత్‌రెడ్డి సర్వే సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. రీసర్వేతో ఖచ్చితమైన కొలతలు తెలుస్తాయని, తద్వార ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న రైతుల సమస్యలు తొలగిపోతాయన్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో రీ సర్వేను పూర్తి చేశామని తెలిపారు. ఆయా గ్రామాల్లో హద్దు రాళ్లను నాటడాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు గోపికృష్ణ, వంశీకృష్ణ, తదితరులు ఉన్నారు.



డ్రోన్‌ను ఎగురవేస్తున్న సర్వే సిబ్బంది

వైభవంగా ప్రసన్న విశ్వేశ్వరుడికి రావణసేవ

ఇందుకూరుపేట : మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రావణసేవను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో ఆదిదంపతులను విశేషంగా అలంకరించి రావణ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయదాతలుగా పద్మశాలి సంఘం వారు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ కనుపూరు సురేంద్రబాబు, ఈఓ తాటా శ్రీనివాసరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి హనుమంత సేవ

కొమరికలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా హనుమంతసేవను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు తులసీరాం ఆధ్వర్యంలో శ్రీవారికి విశేష పూజలు నిర్వహించారు. దేవదేవేరులను విశేషంగా అలంకరించి హనుమంత వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.



మైపాడులో ప్రసన్న విశ్వేశ్వరుడికి రావణ సేవ

వీఓఏలు బాధ్యతగా వివరాలు నమోదు చేయాలి

పొదలకూరు : వీఓఏలు పొదుపు సంఘాల వివరాలను లోకోస్ సీబీఓ మొబైల్ అప్లికేషన్ యాప్ ద్వారా బాధ్యతగా నమోదు చేయాలని వైకేపీ ఏపీఎం సీహెచ్ రోజ్‌మేరీ సూచించారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలకు లోకో సీబీఓ మొబైల్ అప్లికేషన్ యాప్‌పై నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల్లో రెండో రోజైన బుధవారం ఆమె మాట్లాడారు. ఇప్పటి వరకు ప్రభుత్వం సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల సమావేశాలు, ఆర్థిక లావాదేవీలను మొబైల్ బుక్‌కీపింగ్ ద్వారా వీఓఏలు నమోదు చేసేవారని తెలిపారు. ఇకపై లోకోస్ మొబైల్ యాప్ ద్వారా వీఓఏలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం ప్రతి సభ్యురాలు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా, మొబైల్ నంబరు, సంఘ తీర్మాన పుస్తకం, సంఘ బ్యాంకు ఖాతా పుస్తకం తీసుకుని సంఘ సమావేశానికి హాజరుకావాలన్నారు. వీఓఏలు మే 15 నుంచి జూన్ 15 వరకు నెలరోజుల పాటు సంఘాల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. మాస్టర్ ట్రెయినర్స్ కే మస్తానమ్మ, సీహెచ్ శారద, టీ వెంకటేశ్వర్లు, సీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం రోజ్‌మేరీ

వడదెబ్బ తగలకుండా చర్యలు

మనుబోలు: ఉపాధి పనులు చేపట్టే సమయంలో కూలీలు వడదెబ్బకు గురవకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఏపీడీ శ్రీహరిరెడ్డి ఉపాధి సిబ్బందికి సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి సిబ్బంతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9గంటలలోపే పనులు ముగించాలన్నారు. పనిప్రదేశంలో కూలీలకు నీడ, తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. కూలీలకు వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలన్నారు. అనంతరం ఎఫ్ఏలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఓ రాజమ్మ, టీఏ రమేష్, ఎఫ్ఏలు హరేంద్ర, వెంకయ్య, వెంకటరమణయ్య ఉన్నారు.

పోలీసులు న్యాయం చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం: పల్లిపాళేనికి చెందిన తాండ్ర శరణ్య స్థానికులైన కొందరి ప్రోద్బలంతో తమపై తప్పుడు కేసులు పెట్టి బెదిరిస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన తాండ్ర హరికిరణ్, శరణ్య 2021లో పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్యన వివాదం నెలకొనడంతో ఎవరి ఇళ్లల్లో వారు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గత నెల 24న శరణ్య తన ఇంట్లో నూనె పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటన జరిగిన వారం రోజుల తరువాత శరణ్య నెల్లూరులోని ఎస్పీ కార్యాలయానికి వెళ్లి వైఎస్సార్‌సీపీ నాయకులు కే వెంకయ్య, మధు ప్రోద్బలంతోనే తన భర్త హరికిరణ్ తనపై నూనె పోసి నిప్పు అంటించాడని తప్పుడు ఫిర్యాదు చేసిందని గ్రామస్తులు ఆరోపించారు. గత నెల 24న తానే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆస్పత్రిలో తెలిపిన ఆమె ప్రస్తుతం తమపై తప్పుడు ఫిర్యాదులు చేస్తూ బెదిరిస్తోందని వాపోయారు. పోలీసులు న్యాయం చేయాలని కోరారు. నాయకులు కనిసిరి వెంకయ్య, గ్రామస్తులు శారదమ్మ, వెంకటరమణమ్మ, నవీన్, మస్తానయ్య, మధు, నారాయణరావు, ఆదిశేషయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్లిపాళెం గ్రామస్తులు